క్లుప్తంగా...

నేడు మెగా జాబ్ మేళా

సనత్‌నగర్: సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని డాన్‌బాస్కో దిశ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్లు ఐవన్‌వాజ్, స్టీఫెన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. చర్చి ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాలో రిలయన్స్, శుభగృహ , అపోలో ఫార్మసీ, ది ముత్తూట్ గ్రూప్ వంటి దాదాపు 25 కంపెనీలకు చెందిన ప్రముఖులు హాజరై మూడు వేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్హత కలిగిన వారికి అవకాశాలు ఉంటాయన్నారు. 18–30 సంవత్సరాల వయస్సు లోపు ఉండి ఫ్రెషర్స్, అనుభవం కలిగి ఉన్నవారు కూడా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. తమ వెంట మూడు సెట్ల బయోడేటా పత్రాలు, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్ పత్రాలను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94940 92219, 94946 98219 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రంలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం , ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నేటితో మొదటి విడత (30న) గడువు ముగియనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి శుక్రవారం తెలిపారు. దూరవిద్య విధానంలో ప్రవేశపెట్టిన యోగ సర్టిఫికెట్ కోర్సులో ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 8886111690 నంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలో రూ.11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 41, పచ్చకాకర 23, పందిరి బీర 18, క్యాబేజీ 11, క్యారెట్ 25, దొండ 18, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 23, కీర 18, దోసకాయ 16, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 28, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మహంకాళి ఆలయంలో చండీ హోమం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ప్రపంచ శాంతి కోసం ఈ హోమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హోమంలో పాల్గొన్నారు. ఈవో మనోహర్‌రెడ్డి, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



అమీర్‌పేట : వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కార్డియాక్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. అమీర్‌పేట మెట్రోరైల్ స్టేషన్ వద్ద శుక్రవారం జరిగిన శిబిరంలో మెట్రో సిబ్బంది, ప్రయాణికులు పరీక్షలు చేయించుకున్నారు. కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ వాకాస్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్ కమిటీ నియామకం

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీ ప్రొ.రవీందర్ చైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో యాంటీ డ్రగ్ కమిటీని నియమించారు. సభ్యుల్లో ఓయూ సీఐ ఆంజనేయులు, న్యాయకళాశాల ప్రిన్సిపల్ ప్రొ. రాధిక యాదవ్, ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె.సాయిచరణ్‌తో పాటు యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌తో పాటు ఉద్యోగ సంఘనేతను నియమించారు.

నేడు జిల్లా సబ్ జూనియర్ నెట్‌బాల్ టోర్నమెంట్

కాచిగూడ: అంతర్ జిల్లా సబ్ జూనియర్ నెట్‌బాల్ టోర్నమెంట్ నేడు మేడ్చల్‌లో జరుగుతుందని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య, హైదరాబాద్ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎం.విష్ణు ప్రకటించారు. హైదరాబాద్ జిల్లా నుంచి సబ్ జూనియర్ నెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన బాలబాలికలను శుక్రవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారు అభినందించారు. హైదరాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

నాలా పేరుతో నిధులు దుర్వినియోగం

- అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి
- ప్రతి ఏటా ఇదే పరిస్థితి



ప్రమాదం జరిగిన తరువాత జీహెచ్‌ఎంసీ అధికారులు నాలాపక్కన ఏర్పాటు చేసిన పరదా

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఓ నిండు ప్రాణం బలైంది. ప్రతి వర్షాకాలంలో నాలాలు పొంగడం ఆస్తినష్టం జరగడం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో మామూలే. నాలాల నిర్వహణ పేరిట రూ.లక్షలు వెచ్చిస్తున్న అధికారులు నిర్వహణ తీరుతెన్నులను పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలం అవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల ఫలితంగా తాజాగా నిండు ప్రాణం బలైంది. మెట్టుగూడ నుంచి సీతాఫల్‌మండి వరకు ఆవరించి ఉన్న కేవలం 4 కిలోమీటర్ల నాలా పూడితతీత, అభివృద్ధి పనుల నిమిత్తం జీహెచ్‌ఎంసీ అధికారులు ఏటా రూ.65 లక్షలు వెచ్చిస్తుండడం గమనార్హం. నాలాపూడికతీత, విస్తరణ పేరుతో నిధులు వెచ్చిస్తున్నా ఆదిశగా ఎక్కడా పనులు చేపట్టిన దాఖలాలు లేవని నాలా పరివాహక ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నాలాల కోసం విడుదల చేస్తున్న నిధులు అధికారులు, ప్రజాప్రతినిధుల స్వలాభం కోసం తప్ప ప్రజా సంక్షేమం కోసం వినియోగపడడం లేదు. ఇలా ఏఏటికి ఆయేడు నిధులు వృథా చేయడం, తూతూ మంత్రంగా పనులు పూర్తిచేసి చేతులు దులుపుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల నిర్లక్ష్యమే...

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంతోనే వరద ప్రమాదంలో మహిళ మృతి చెందినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. మెట్టుగూడ–చిలకలగూడ మార్గంలో రైల్వే కాజ్‌వే (ఆర్‌యూబీ) ఉంది. పురాతన కాలంలో నిర్మించిన వంతెన కంటే ఇరువైపులా రోడ్డు ఎత్తుగా ఉండడంతో వరదనీరు మొత్తంగా కాజ్‌వే కిందకు చేరుతుంది. ఇక్కడి వరదనీరు బయటకు వెళ్లడానికి అధికారులు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయని కారణంగా నాలా రిటైనింగ్‌వాల్‌కు చేసిన రంధ్రం ద్వారా వరదనీరు నాలాలోకి చేరుతుంది. గురువారం సాయంత్రం వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో అదే దారిగుండా నడిచి వస్తున్న వెంకటమ్మ అనే మహిళ అదుపుతప్పి నాలాలోకి కొట్టుకుపోయింది. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి వద్ద నాలాపరిస్థితి ప్రమాదకరంగా ఉందని తెలిసినా అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకున్న పాపాన పోలేదు. జరగాల్సిన ప్రమాదం జరిగాక మాత్రం నాలా రిటైనింగ్‌వాల్‌కు జాలీని ఏర్పాటు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా స్థానికులు వరదనీటిని నాలాలోకి తరలించేందుకు రిటైనింగ్‌వాల్‌కు రంధ్రం చేసిన కారణంగానే ప్రమాదం జరిగిందని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతుండడం గమనార్హం.

అంత్యక్రియలు పూర్తి

చిలకలగూడ దూద్‌బావి వద్ద వరదనీటి ప్రవాహంలో కొట్టుకుపోయి నాలాలోపడి మృతి చెందిన సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావికి చెందిన వెంకటమ్మ అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. అంత్యక్రియలకు సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ హాజరయ్యారు. అంత్యక్రియల నిమిత్తం ఆమె రూ.10వేల ఆర్థికసహాయం అందించారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్, జీహెచ్‌ఎంసీ అధికారులను సంప్రదించి మృతురాలు వెంకటమ్మ కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామన్నారు.

అవగాహన లేక పెరుగుతున్న గుండె జబ్బు మరణాలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

రాంగోపాల్‌పేట్: గుండె జబ్బులపై అవగాహన లేకపోవడం వల్లే గుండె సంబంధిత వ్యాధులకారణంగా మరణాలు పెరుగుతున్నాయని కిమ్స్–సన్‌షైన్ ఆస్పత్రి ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్‌శ్రీధర్ కస్తూరి అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆస్పత్రిలోని ఆడిటోరియంలో గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో గుండె జబ్బులతో మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజల్లో గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తే చాలా వరకు మరణాల సంఖ్య తగ్గించవచ్చని చెప్పారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ శైలేందర్ సింగ్, డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



సురంగధర్

రాంగోపాల్‌పేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. నల్లగుట్టకు చెందిన సురంగధర్(71) ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఈ నెల 27న ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సురంగధర్ తర్వాత బంధువుకు ఫోన్ చేసి ఆధార్ అప్‌డేషన్ కోసం బయటకు వెళ్తున్నానని చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన కుమారుడు కిరణ్‌కుమార్ తండ్రికి ఫోన్ చేస్తే తాను తూంకుంటలోని స్నేహితుడు చవాన్ ఇంటికి వెళుతున్నానని 4 రోజుల్లో ఇంటికి తిరిగి వస్తానని చెప్పాడు. మళ్లీ సాయంత్రం 5 గంటలకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వెంటనే ఆయన తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎక్కడ ఆచూకీ కనిపించ లేదు. ఇంటి దగ్గర నుంచి ఆయన వెళ్లిన ఆటోను గుర్తించి డ్రైవర్‌తో మాట్లాడితే మియాపూర్ చౌరస్తాలో దిగిపోయినట్లు చెప్పాడు. దీంతో కిరణ్‌కుమార్ శుక్రవారం రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సమగ్ర అధ్యయనంతోనే పురోగతి

మంత్రి హరీష్‌రావు



సనత్‌నగర్: సమగ్రమైన ఆర్థిక, సామాజిక అధ్యయనం చేసినప్పుడే ఏ రాష్ట్రమైనా, దేశమైనా పురో గతి చెందుతుందని మంత్రి హరీష్‌రావు అన్నారు. అయా అంశాల సర్వే నివేదికల ఆధారంగానే మంచి పరిపాలన అందించడం సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో రూ.5 కోట్లతో నిర్మించిన విద్యార్థినుల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, పథకాల రూపకల్పన, అమలు చేయడంలో సామాజిక అధ్యయనాలు ఎంతగానో అవసరమన్నారు. ఆ దిశగా సెస్ అధ్యయనాలు ప్రభుత్వాలకు వెన్నెముకగా పనిచేస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం సెస్‌ను ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ఒక పథకం అమలుచేసే ముందు ప్రజా కోణంలో ఆలోచిస్తారన్నారు. అందుకే ఆ పథకాలు విజయవంతమై దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కేసీఆర్ కిట్‌లో భాగంగా ట్రాకింగ్ సిస్టంను తీసుకువచ్చి మూడో నెల నుంచే గర్భిణీ మహిళల ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో దృష్టిసారించామన్నారు. జాతీయ స్థాయిలో సెస్‌లో పీహెచ్‌డీ కోర్సుకు డిమాండ్ ఉన్న దృష్ట్యా వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు వస్తున్నారని, వారి అవసరాల నిమిత్తం బాలికల వసతి గృహాన్ని ఏర్పాటుచేసుకున్నట్లు తెలిపారు. హాస్టల్ భవనం కార్పొరేట్ స్థాయిలో నిర్మించడంతో పాటు ఎకో ఫ్రెండ్లీ, గ్రీన్ కాన్సెప్ట్ విధానంలో ప్లాన్ చేసిన ఆర్కిటెక్చర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సెస్ ఫౌండర్ మెంబర్ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఫైనాన్స్) డాక్టర్ జీఆర్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా వర్శిటీ వీసీ రవీందర్, సెస్ డైరెక్టర్ రేవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మానస్‌కుమార్ డే తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ అష్టమైతి

రాంగోపాల్‌పేట్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మద్యం తాగేందుకు డబ్బు లేకపోవడంతో ఇంట్లో ఉరివేసికుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెస్ట్ బెంగాల్‌కు చెందిన అష్టమైతి (37) కొద్ది సంవత్సరాల క్రితం భార్య ప్రియాంక, కుమారుడితో కలిసి జీవనోపాధి కోసం నగరానికి వచ్చి కండోజీబజార్‌లో నివాసం ఉంటున్నాడు. ఇదే ప్రాంతంలో ఉండే సోదరుడు దశరథ్ మైతి వర్క్‌షాపులో గోల్డ్‌స్మిత్‌గా పనిచేస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన అతడు నిత్యం తాగుతూ పనికి కూడా సరిగా వెళ్లేవాడు కాదు. గత వారం రోజుల నుంచి పనికి వెళ్లకపోవడం మందు తాగేందుకు డబ్బులు లేకపోవడంతో ఆత్మహత్య చేసికోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున అష్టమైతి తన గదిలో పడుకున్నాడు. ఉదయం భార్య గదిలోకి వెళ్లి చూడగా అక్కడ కనిపించకపోవడంతో బాత్‌రూమ్‌కు వెళ్లి తలుపు కొట్టింది. ఎంతకూ తలుపు తీయకపోవడంతో కుమారుడితో కలిసి తలుపులు పగులగొట్టి చూడగా షవర్‌కు టవల్‌తో ఉరివేసికొని కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు మహంకాళి పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని 108 సిబ్బందిని పిలిపించారు. 108 పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు ధృవీకరించారు. భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్మార్ట్ బైక్‌కు గుర్తింపు



స్మార్ట్‌బైక్ నిర్వాహకులకు అవార్డు అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

సనత్‌నగర్: దేశంలో ఉత్తమ బైక్ షేరింగ్ సంస్థగా నగరానికి చెందిన స్మార్ట్ బైక్‌కు గుర్తింపు లభించింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్మార్ట్ బైక్ చైర్మన్ డీవీ మనోహర్, ప్రతినిధులు అనిందిత మిత్ర, ఎస్‌పిఎస్ శర్మలకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బేగంపేటలోని హోటల్ మనోహర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్మార్ట్ బైక్ ఎండీ దొంతంశెట్టి వివరాలను తెలిపారు. దేశంలోని వంద నగరాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా స్మార్ట్‌బైక్‌లను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఒక్క చండీఘడ్‌లోని 617 బైక్ స్టేషన్‌లో 5 వేల స్మార్ట్ బైక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కాలుష్యాన్ని నివారించడం, ప్రజల రవాణా అవసరాలను తీర్చడానికి సాధారణ స్మార్ట్‌బైక్‌లతో పాటు ఎలక్ట్రిక్ బైక్‌లను కూడా అందజేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కూడ త్వరలో పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు.

ప్రశాంతంగా గణనాథుడి నిమజ్జనం





చిలకలగూడ : నవరాత్రులు మండపాల్లో కొలువుదీరి విశేష పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జన శోభయాత్ర చిలకలగూడ ఠాణా పరిధిలో గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనాల్లో లంబోదరుడిని నిమజ్జనానికి ట్యాంక్‌బండ్‌కు తరలించారు. డప్పుల దరువులు, తీన్‌మార్ స్టెప్పులతో గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటు నినాదాలు చేస్తు సాగిన శోభాయాత్ర ఆద్యంతం ప్రజల హృదయాల్లో భక్తి పారవశ్యాన్ని నింపింది. చిలకలగూడ మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన కొలనుల్లో వినాయక విగ్రహాలను పెద్దసంఖ్యలో నిమజ్జనం చేశారు. వారాసిగూడ నుంచి చిలకలగూడ చౌరస్తా వరకు పలువురు ఏర్పాటు చేసిన స్వాగత వేదికల నుంచి నిమజ్జనానికి తరలుతున్న గణనాథునిపై పూలవర్షం కురిపించారు. స్వచ్ఛంద, సామాజిక సంఘ ప్రతినిధులు ప్రసాదాలు, మంచినీటి ప్యాకెట్ల పంపిణీ చేశారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ మట్టంరాజుల నేతృత్వంలో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. డివిజన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని, నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు.

2న హెచ్‌యూజే ఆందోళన

కాచిగూడ: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, అక్రిడేషన్ జర్నలిస్టులకు రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ.. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీన ఉదయం 10 గంటలకు ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద జర్నలిస్టుల ధర్నా, నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్‌యూజే ఉపాధ్యక్షుడు పుండరీచారి ప్రకటించారు. శుక్రవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. ఐజేయూ జాతీయ కార్యదర్శి నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ఎం.ఏ.మాజీద్, హెచ్‌యూజే అధ్యక్షుడు శంకర్ గౌడ్, కార్యదర్శి షౌకత్ హమీద్ తదితరులు పాల్గొంటారని సమాచారం. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జరిగే ఈ ఆందోళనలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

60 ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదిన్నర ఏళ్లలో జరిగింది



జెక్‌కాలనీలో హనుమాన్ దేవస్థానం ఆర్చిని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: గడిచిన 60 ఏళ్ళలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదిన్నర సంవత్సరాల్లో జరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లో రూ.2.84 కోట్ల విలువైన 10 అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జెక్‌కాలనీ ప్రవేశద్వారం వద్ద నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవస్థానం ఆర్చిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ, మంచి నీటి సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. పార్కులను కూడా ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చినట్లు వివరించారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలను ఒకే రీతిలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఎల్ఐజీహెచ్‌లో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానికులు మంత్రిని కోరగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంకా సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డీఎంసీ జగన్, హనుమాన్ దేవస్థానం ఈఓ శ్రీనివాసరాజు, నాయకులు బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, సరాఫ సంతోష్, ఖలీల్‌బేగ్, రాజేష్‌ముదిరాజ్, జెక్‌కాలనీ ప్రతినిధులు మల్లు ప్రసాద్, డాక్టర్ వైవీ రాఘవయ్య, సురేష్‌చౌదరి, శ్రీహరి, నాగిరెడ్డి, మల్లారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు రవీంద్రాచార్యులు, రిపుంజయశర్మ, విజయేంద్ర, గోపాల్‌జోషి, సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్య ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట



ఎల్‌ఓసీని అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: పేద ప్రజల వైద్య ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ఆ దిశగా పథకాలు, కార్యక్రమాలు రూపొందించి ముందుకు సాగుతోందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు పేద కుటుంబానికి చెందిన కృష్ణయ్య చికిత్స కోసం శుక్రవారం రూ.2.5లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బాధితుడి కుమారుడు భాస్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి ఎంతో దొహదపడుతున్నదని చెప్పారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయంతో పాటు ఎల్వోసీలను అందజేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ వైద్య రంగాన్ని ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. నూతన ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు నగరంలో అనేక ప్రాంతాల్లో బస్తీ దవఖానాల ద్వారా పేదలకు ఉచితంగా వైద్య ఆరోగ్య సేవలతో పాటు మందులను కూడా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్. వెంకటేశన్, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి మహేష్, మహేందర్, నాగలక్ష్మి, వెంకట్ ముదిరాజ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకురాలు ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు నాగలక్ష్మికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శాల్వకప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వేలో 48 మంది పదవీ విరమణ



పదవీ విరమణ పొందిన వారికి వీడ్కోలు పలుకుతున్న సహోద్యోగులు

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 48 మంది ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. హెడ్ క్వార్టర్స్, హైద్రాబాద్, సికింద్రాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాప్‌లో వీరు విధులు నిర్వహించారు. లేఖా భవన్‌లో మల్యాల శ్రీనివాస్, కొండల రావు, రైల్ నిలయంలో జేసుదాస్, నాగేశ్వరరావులకు తోటి ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎంప్లాయిస్ సంఘ్ మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్, మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచి కార్యదర్శి చింతకుంట రామకృష్ణ పదవీ విరమణ చేసిన వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



పీజే స్టీఫెన్‌పాల్ మెగా వైద్యశిబిరంలో పాల్గొన్న రాజీవ్‌సాగర్ తదితరులు

రసూల్‌పురా: పీజే స్టీఫెన్‌పాల్ మిషనరీస్ వ్యవస్థాపకులు, స్టీఫెన్‌పాల్, షైలాపాల్‌లు తమ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్ అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ కేజేఆర్ గార్డెన్‌లో పిజేఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు షైలాపాల్ జన్మదినం సందర్భంగా మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ స్టీఫెన్‌పాల్ ఆధ్వర్యంలో ప్రతి యేటా వేలాది మందికి వైద్యపరీక్షలు, ఉచితంగా మందులు కంటి అద్దాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని పేద ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తుందని తెలిపారు. శిబిరంలో పేదలకు కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్, గైనకాలజిస్ట్, యూరాలజిస్ట్, పిడియాట్రిషన్, అప్తామాలజిస్ట్ తదితర నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు.

ఎల్ఓసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. అడ్డగుట్ట సీ సెక్షన్‌కు చెందిన రెండు సంవత్సరాల ఓం ఇంద్రన్ష్ గుండె సంబంధిత వ్యాధితో కొంత కాలంగా బాధపడుతున్నాడు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన బాలుడి చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ. లక్ష మంజూరు చేయించారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి చేతుల మీదుగా ఎల్ఓసీ పత్రాన్ని బాలుడి కుటుంబసభ్యులకు అందజేశారు. పేద ప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత నరేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర అలవాట్లతో గుండె పదిలం

కాచిగూడ: ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామంతోనే గుండె పదిలంగా ఉంటుందని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కాచిగూడలో గుండె సంబంధిత వ్యాధులపై ఆయన ప్రజలకు అవగాహ న కల్పించారు. బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటే గుండెను కాపాడుకోవచ్చన్నారు. నిరుపేదలకు సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా అందించేందుకు ఆరోగ్య శ్రీ పథకంతో పాటు రాష్ట్రంలో జీవన్‌దాన్ సమర్థవంతంగా అమలౌతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

వ్యాయామంతో గుండె వ్యాధుల నివారణ..

ముషీరాబాద్: ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో గుండె వ్యాధులను నివారించవచ్చని ముషీరాబాద్ కేర్ ఆసుపత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాష్ గుల్లా అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శుక్రవారం ముషీరాబాద్ కేర్ ఆసుపత్రిలో కేర్ ఫేషెంట్ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మానవ శరీరంలో గుండె ఎంతో ప్రధానమైందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలి, పౌష్టికాహారం, వ్యాయామం ద్వారా గుండె వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. అవగాహన రాహిత్యం, శారీరక శ్రమ లేకపోవడంతో చిన్న వయస్సులోనే గుండె సంబంధిత వ్యాధుల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండె సంబంధిత వ్యాధులతో కేర్ ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న పలువురిని ఘనంగా సన్మానించారు. రాజు చౌరే, డాక్టర్ సుజిత్‌కుమార్, డాక్టర్ క్రిష్టఫర్, డాక్టర్ అబ్దుల్ నఫీ, మీడియా సెల్ ఇన్‌చార్జి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379